# మారిన మనిషి

సాధారణంగా జరగనిది ఆవేళరాత్రి తొమ్మిది కాకండానే భోజనం టేబిలు యెదురుగా డాక్టరు యశ్వంతరావు కులకర్ణి కూర్చున్నాడు. భార్య వందన, ముఖంలో చిరునగవు వెలిగింది. పిల్లలిద్దరూ నిద్దరపోతుండగా ఒంటిగా కూర్చొని ఓ అరగంట క్రితమే లేనిపోని ఆలోచనలతో మెదడు నింపుకుంది. బహుశః పెళ్ళికాక మునుపు సుఖం పేరుతో నిర్మించుకున్న వూహాలకీ, జరుగుతున్న నిజానికీ తేడా మనసులో కొట్లాడిందేమో? భార్య భోజనం సగమైనా పూర్తికాలేదు. కులకర్ణి అలా యెదురుగా కూర్చొని ఆమె పెదిమలను టేబిలుమీద వున్న యెర్రని ఆపిలుపండునూ సరిపోలుస్తున్నాడు.

ఇద్దరూ జీవితంలో వింతగా కలుసుకున్నారు. అప్పుడప్పుడూ, వాళ్ళ భావాలు, నటనలూ వింత అనుభవాలై జీవితం వృక్షానికి క్రొత్త చిగుళ్ళులా వుంటాయ్. ఆమె అతనిని ఒక పిక్‌పిక్ స్థలంలో చూసింది. ఆమె కారులో వచ్చింది. అతను బస్సుమీద వచ్చాడు. తిరుగ వెళ్ళిపోతూ బస్సుస్టాపుకి నడచిపోతున్న అతనిని చూసి కారు ఆపింది. అతను వచ్చి నిల్చున్నాడు. ఆమె కారు తలుపు తీసి కూర్చోమంది. ఇలాంటి ఘట్టాలు మామూలు నగరాల్లో జరగకపోయినా- బొంబాయి లాంటి మహానగరాల్లోనూ, సినీమాల్లోనూ అగుపిస్తుంటాయ్. అంతస్థులూ జాతీ వాళ్ళపెళ్ళికి అడ్డుగోడలు పెట్టలేకపోయాయ్. ఆమె భాష సింధీ, అతని మరాఠీ హిందీలో సమన్వయమైపోయాయ్. వాళ్ళిద్దరికీ ఒక పాప, ఒక బాబువున్నారు. స్వంత అర్జనతో కొన్న కారు, కట్టించుకున్న యిల్లూ వున్నాయి.

ఆమె యివన్నీ కావాలని కోరుకుంది - వాటికోసం అటమటించింది. ఇవన్నీ రాగానే యింకేదో కావాలనే కోరిక-తను ప్రేమించి పెళ్ళాడిన భర్త యెల్లప్పుడు తనదగ్గరగా వుంటే ఆ భాష, భావన, ఆ హృదయ స్పందన, పాలవెన్నెలలా, పూలపాన్పులా- ఆ జీవితం యొక్క సొగసే వేరు. ఆమెకు యీ కనీసపు కోరిక తీరని కోరికయై వూహలో వుండిపోవటం యిష్టంలేదు.

ఆ వేళ సాయంత్రంనించీ పెనుగాలులతో కుండపోతగా పోస్తున్న వర్షం కూడా ఆమెకు చిరాకెత్తిస్తోంది. భర్త యింత వేగిరంగా డిస్పెన్సరీ నుంచి లోనికి కాలుపెట్టిననాడు. నిండు జాబిలి వుంటే- పోర్టికో మీద రెండు వాలు కుర్చీలు వేసుకొని యిద్దరూ హాయిగా గడిపేవారే! చప్పున చిరాకుగా "వేగంగా వచ్చారు- ఈ వేళే యీ పాడు వర్షం!" అంది.

"నన్ను యింత వేగిరం రప్పించింది యీ పాడు వర్షమే కదూ?"

ఇద్దరూ గదిలో పరుపుమీద కూర్చున్నారు. రేడియోలోంచి మెల్లగా "రసిక బలమా" లత మధుర స్వరం వినిపిస్తోంది.

ఇంతలో అంగటి తలుపు యెవరో "డాక్టరు...... డాక్టరు....." అని బాదటం మొదలుపెట్టారు. సాధారణంగా బెల్ వాగేది. ఏంటో తొందర–? డాక్టరు వెంటనే పరుగెత్తాడు. కొంతసేపయ్యాక ఆమె రాలుతున్న కన్నీరు తుడుచుకొని మెల్లగా లేచింది. గోడచాటున నిల్చొని ఆ వచ్చిన మనిషికి తెలియకుండా వింటోంది.

డాక్టరు ఆ వచ్చిన వ్యక్తికి తగిలిన చిన్న చిన్న గాయాలకు కట్టుకట్టాడు.

"ఫీజు యెంత?"

"మీ రెవరు?"

"మనుషుల రాబడి చూసి డబ్బు పుచ్చుకుంటారా?"

"అవును."

"నాకు రాబడి లేకపోతే......."

"మీ రేమీ యివ్వకండి......లేనివాడిని కలవాడు భరించవలసిన బాధ్యత వుందిగా!"

"అలాగా.....నేను ప్రభుత్వం పనిమీద వచ్చాను. వస్తూనే ఆ రైలు లైను దగ్గర పడిపోయాను......"

"ఇంతరాత్రి మీద యీ వర్షంలో మీరు చేసేపని....."

అతను తన సి.ఐ.డి. చిహ్నాన్ని చూపించాడు. డాక్టరు అన్నాడు – "ఈ చుట్టుపట్ల హంతకులెవరూ వుండరనుకుంటాను."

"చూడండి" అంటూ డిస్పెన్సరీ కిటికీ తెరిపించి పడమటి వేపు చూపించాడు. అప్పుడే ఒక యెలక్ట్రిక్ ట్రైన్ వెళ్ళిపోతోంది. ఆ వెలుగులో ఓవర్ బ్రిడ్జి క్రింద ఒక మూలకు ఒకే చిన్నపాక అగుపించింది. మళ్ళీ ఓ క్షణంలో చీకటి– హోరు మనే వర్షం!

"అందులో యే కటిక పేదవాడో పెళ్లాం పిల్లలతో పిడికిటిలో ప్రాణం పెట్టుకొని వుంటాడు."

డాక్టరు మాటలు విని నవ్వుతూ "ముందు కిటికీ ముయ్యండి" అన్నాడు. డాక్టరు కిటికీ ముయ్యగానే "ఈ చుట్టుపట్ల యింకెవ్వరూ లేరుకదా......?" అన్నాడు.

"లేరు!"

"ఎవరోవున్నా ఒకడిని చంపడానికి ప్రయత్నించిన వాడని మా నమ్మకం. వారం రోజులనుంచీ ప్రయత్నిస్తున్నాం– పసిగట్టాడేమో యింటికే రాలేదు."

"ఎక్కడ ఆ నేరం జరిగింది........"

"ఒక పెద్ద కలవారింట్లో కన్నం వెయ్యాలని చూసి......"

"ఏం చేశాడు.....?"

"కత్తితో యింటి యజమానిని పొడిచాడు. ఆయనకి ఆయుస్సు వుంది."

"వారం రోజులై యింటికి రాలేదంటున్నారు. అయితే పెళ్ళాం పిల్లలూ యేం తింటున్నారు?"

"ఆ పెళ్ళమా? చాలా ఘరానా మనిషి. దొంగసారా చేరవేస్తుండగా రెండుసార్లు దొరికి జైలుకు వెళ్ళింది."

"పిల్లలూ?"

"తొలి కాన్పు- నవమాసాలు నిండి పోయాయ్. ఏ క్షణంలో ప్రసవిస్తుందో? వాడికి యింకెవరూ లేరు. వాడికి ఆమె పరిస్థితి తెలిసే వుంటుంది. వచ్చితీరుతాడు. అప్పుడు ఆ పాకలో వాడ్ని పట్టుకోవచ్చు-"

"అయితే....."

"మీ సంశయం..... వాడు రాకపోతే యెలా అనా? ఆ దగ్గరలో కొండవుంది చూశారా? ఏ తుప్పల్లోనో దాగొనివుంటాడు. అందుకే కదా మే మీ కూలివాళ్ళ డ్రెస్‌లో వున్నాం.... అర్ధరాత్రి దాటగానే....... దిగుతాడు."

"ఈలోగా ఆమె ప్రసవిస్తే....."

"పుట్టిన పిల్ల ఏడుపువిని దిగిపోతాడు........."

"ప్రసవం చిక్కాకైతే....."

"లోకంలో యెందరు చావటంలేదు. ఒక నేరస్తురాలు పోలీసువాళ్ళ శిక్షనుంచి తగ్గుతుంది....."

డాక్టరు మెల్లగా అక్కడే స్టాండుకువున్న రైనుకోటు వేసుకుంటుంటే "ఎక్కడకు ప్రయాణం?" అన్నాడు.

"ఆ నిండు చూలాలను యిక్కడకు తీసుకవస్తాను."

"నా మాట వినండి. మీరు అనవసరంగా యీ నేరస్తుల వ్యవహారాల్లో చిక్కుకుంటున్నారు."

"మీరు చెప్పవలసినవి చెప్పారుగా...."

"కనికారం అందరికీ చూపించడం మంచిదికాదు. పాముకు పాలిచ్చి పెంచినట్లే అవుతుంది. నా మాట వినండి. మీ చేతులకు బేడీలు వేసే పరిస్థితి తీసుకు రాకండి."

"నేనేం నేరం చెయ్యలేదుగా.....?"

"నేరస్థులను మీ యింట్లో పెట్టుకోబోతున్నారు. మాకు దక్కబోయే ఖూనీకోరుని మా చేతికి చిక్కకుండా చేస్తున్నారు.... మీరు వెళ్ళటాన్కి వీలులేదు."

"నాతో మీ పని అయిపోయిందిగా.... మీరిక వెళ్ళవచ్చును" అంటూ ముందుకు నడిచాడు.

అతను వెళ్ళిపోతూ "మీరేకాదు, మీ కుటుంబాన్ని- తరతరాలవారినీ బాధపెట్టుతున్నారు" అన్నాడు. వర్షం యింకా పడ్తునేవుంది.

కారు స్టీరింగు పట్టుకునే సమయానికి వందన పరుగునవచ్చి చెయ్యి పట్టుకుంది.

"వద్దు-వద్దు- వెళ్ళకండి...."

"తడిచి పోతున్నావ్... రా నువ్వూ రా...."

"నేను రాను, మీరూ వెళ్ళొద్దు. ఈ కనికారం మన బ్రతుకుల మీదకే వస్తుందని....."

డాక్టరు కారుతలుపు తీసాడు. ఆమె లోనకూర్చొని అతనిభుజం పట్టుకొని దైన్యంగా "దానికేమైనా మన మీదకే వస్తుంది. అలాంటి నేరస్తులతో మనకేంపని? మనకీ పిల్లలున్నారు- వాళ్ళ భవిష్యత్తయినా ఆలోచించారా?" అంది.

డాక్టరు కారు యింటిముందుకు తీసుకవెళ్ళి తలుపు తెరుస్తూ- "నీవే ఆ పరిస్థితిలో వుంటే.....?" అన్నాడు. ఆమె మాటాడకుండా దిగిపోయి చర్రున యింట్లోకి వెళ్ళిపోయింది. డాక్టరు తిన్నగా కారు తీసుకువెళ్ళి ఓవర్ బ్రిడ్జిమీద ప్రక్కకు ఆపాడు. టార్చిలైట్ వేసుకొని బురదలో దిగాడు. ఒకప్రక్క రోడ్డుగోడ, మిగతా మూడు ప్రక్కలు చిన్న రేకులూ, తడికలూ కలిపికట్టిన గోడలు. వర్షంవెలిపిరి ఒక వైపు నుంచి బాగా కొట్తోంది. లోన ఒక మూలకు బురదలో ఒక స్త్రీ మూలుగుకుంటూ వణుకుతూ ప్రసవవేదన పడుతోంది.

"ఈ దగ్గరలో నున్న డాక్టరుని. నా యింటికిరా అమ్మా- పురుడు పోసుకొని వచ్చేద్దువుగానీ....."

ఆమె మూలుగుతూ "దేముడిలా వచ్చావు బాబూ... లేకపోతే- గతిలేక చచ్చిపోయేదాన్ని....."

ఆమెను మెల్లగా లేవనెత్తాడు. తనమీద నున్న రైన్‌కోటుతో ఆమెను కప్పి అతికష్టంమీద రోడ్డు యెక్కించాడు. అతను పూర్తిగా తడిచిపోయాడు. కారు యింటి ముందర ఆగినా భార్య యెదురుపడలేదు. డిస్పెన్సరీ ప్రక్కనేవున్న గదిలో మంచం మీద ఆమెను వేసాడు. తను బట్టలు మారుస్తున్నప్పుడైనా భార్య అతని వేపు చూడలేదు. బీరువాలో ఆమె చీరెలు రెండు, దుప్పటి తీసుకవెళ్ళుతున్నప్పుడైనా యెందుకని అడగలేదు.

రాత్రి పన్నెండు దాటి పోయింది. డాక్టరు ఆమె విషయంలో శ్రమ పడ్తున్నాడు. ఇంకా పురుడు రాలేదు. వందన కిటికీలోంచి వర్షంలో తడిచిపోతున్న కారును చప్పున చూసింది. భర్త యింటికి సంబంధించిన విషయాన్ని యెప్పుడు తీసుకున్నారని తను పట్టుపట్టనిది, తగువు తెచ్చుకోనిది ఈ కారుమాత్రం వచ్చిందా? సుఖించడానికి అవకాశాలన్నీవున్నా బాధపడే భర్తనుచూస్తే ఆమెకు యేవగింపు కలిగింది. వెళ్ళి కారును గేరేజిలో పెట్టి వచ్చింది. అంగటి తలుపులు చారవేద్దామనుకుంటుంటే ఒకడు వర్షంలో తడిచి ఆమెను లెఖ్ఖచెయ్యకుండా లోనపడ్డాడు. పడినవెంటనే దాచిన పదునైన కత్తితీసి ఆమె ఎదురుగా పెట్టాడు. ఆమెగుండె ఆగిపోయినట్లయింది. కళ్ళు నిల్చుండి పోయాయ్. నోరు ఆవలించినా మాట రాలేదు. పెద్దకేక వేయాలనుకొంది. కానీ కొయ్యబారిపోయింది. ఆ క్షణంలోనే ఆమె అనుకున్న సుఖాలన్నీ ఆ కత్తితో ఛేదింపబడి పోయాయ్.

వాడు నవ్వుతూ కత్తి మళ్ళీ మొలలో దాచిపెట్టాడు. "లోపలనించి మూలుగు వస్తుంది.... మా యింటిదేకదూ?"

"హాఁ...." అని మూలిగింది.

"అనాడు ఓ కంట సూస్తుండని నెప్పినానుకదా? మా తల్లి ఆపదలో దాన్నోకంట సూసినావు....."

"ఆఁ.....ఆఁ......" అంది.

"నాకు తెలుసును–నువ్వు సూస్తావని. దాన్నే నువ్వు తేకండా వుంటే అది అక్కడ సచ్చిపోను.... అది సచ్చిపోతే... నీకూ.... పిల్లలకీ యీ కత్తితో... ఫైసలా సేసేద్దును......"

ఇంతలో యీ గొడవకు డాక్టరు బయటకు వచ్చాడు. డాక్టరుని చూడగానే సాష్టాంగ పడిపోయి లేచి "మా రాజా – నాను మా సెడ్డోడ్ని – తాగుతాను – దొంగతనం సేస్తాను..... అవుసరం అయితే పీకలు యీ కత్తితో కోసేస్తాను – అమ్మ పిల్లలతో ఒక రోజున తాళం వేసుకునివుంది. మావి ఒంటిపేణాలు– యిరుగునేదు– పొరుగునేదు– దగ్గరవున్నావమ్మా– కలిగిన యిల్లాలివి– డాక్టేరు పెళ్ళానివి– మాలాంటి బీదోలని ఒకన్నుతో సూడమ్మా అన్నాను. మా రాజుతల్లీ యీ రేతిరికాడ మరిసిపోకండా తమర్ని పంపింది– మా దొడ్డ యిల్లాలు. మీ పిల్లలకూ మీకు బగమంతుడు నూరేళ్ల ఆయుస్సువు యిచ్చి –మరి పది మేడలూ మిద్దెలూ యిస్తాడు," అన్నాడు.

మళ్ళీ డాక్టరు గబగబ లోనికి వెళ్ళిపోయాడు. ఆతృతపడుతూ లోనికి వెళ్ళబోతున్న ఆమె భర్తను లోనికి రానివ్వలేదు. అక్కడేవున్న బెంచీమీద కూర్చోబెడిబోయాడు.

"కూర్చో...... తల్లీ......కూర్చో......"అన్నాడు.

ఆమె యెదురుగా వున్న కుర్చీమీద కూర్చుంది.

"ఇది వృత్తి యెర్రిబాగుర్ది అమ్మా..... అదిగాని యేం అయిపోనాదీ అంటే ఈ పట్నం పట్నం అంతా నిప్పంటించేస్తాను. ఎళ్ళి ఆ దేముడి ముక్కుమీద రకతం వచ్చినట్టు గుద్దుతాను....."

ఆమె విధిలేనట్లు వింటోంది.

"ఈ మేడలోకి వచ్చింది–దేముడి లాంటి మా రాజు సేతుల్లో పడ్డాది. దానికేమీ సెడుగు రాదులే– మీ కంటె తల్లి దండ్రులెవరున్నారు దానికి?"

"ఇది తొలికాన్పా?"

"అవునమ్మా అవును– అదంతా అదొక గాద–

"నా బతుకే ఒక కథ. నేనెక్కడ పుట్టాను? ఎందుకు పుట్టినాను? ఎక్కడకు వచ్చినానూ? అంతా మాయ తల్లీ.... బతుకంతా మాయ. ఈ మాయ తెలుసుకోలేక నానాయాతనపడి కాట్టుకుంటాం."

లోనుంచి గట్టిగా మూలుగూ యేడుపూ వినిపిస్తోన్నాయి. వాడు లేచిపోయి యిటూ అటూ వెర్రిగా తిరుగుతున్నాడు. చివరకు ఒక్కసారి తలుపు కొట్టి "బాబ్బాబూ..... నన్ను రానివ్వండి" అన్నాడు.

కొద్ది క్షణాలుపోయాక కెవ్వున ఒక కేక వినపడింది. తలుపు తెరువబడింది. అంతా ప్రశాంతం. ఎదురుగా నిల్చోగానే "కొడుకు...." అన్నాడు డాక్టరు.

"కొడుకా? నాకు కొడుకా? ఈ దొంగనాయాళకి కొడుకు పుట్టాడా బాబూ?"

"అవును చూడు...."

దొంగ గెంతులువేస్తూ కారుతున్న కన్నీరు తుడుచుకొంటూ మొలనున్న కత్తిని గదిలో ఒకమూలకు విసిరేశాడు.

కొన్ని క్షణాలు మాటలు రాలేదు. అప్పటికికానీ భార్యవేపు చూడలేదు. ఆమె

కళ్ళు మూసుకొని వుంది.

"రంగీ–రంగీ" అన్నాడు మెల్లగా.

రంగి పలుకలేదు. "బాబ్బాబు" అన్నాడు.

"బాగా శ్రమపడిపోయింది, అలా పడుకోనీ.... నడు బయటకు, నడు....."

మెల్లగా బయటకు వచ్చాడు. ఇంకా కుర్చీమీద కూర్చున్న వందనతో "నా తల్లీ రా తల్లీ– ఇదంతా మీ చలవ.... నా బాబును చూడండి" అంటూ ఆమె లేచేవరకు విడిచి పెట్టలేదు.

చూసి "బాగున్నాడు" అంది.

కాస్సేపయ్యాక వీళ్ళిద్దరితోపాటు డాక్టరుకూడా బయటకు వచ్చాడు.

"రా...." అన్నాడు.

ఆ దొంగ వెంటపడ్డాడు.

"నీ పేరు......"

"గోవింద్."

"గోవింద్! ఆ బట్టలతో వుంటే రొంప పడ్తుంది.....రా ......బట్టలు మార్చు!" అంటూ బీరువానించి ఒక కమీజు, పేంటు తీసి యిచ్చాడు. అవి వేసుకున్నాక "రా....ఇక్కడ కూర్చో" అని డైనింగు టేబిలు యెదురుగానున్న కుర్చీ చూపించాడు.

"నేల కూర్చుంటాను బాబూ–"

"ఫరవాలేదులే.....రా" అంటూ చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టాడు. భార్యకు సైగచేశాడు. ప్లేటులో జామ్‌రాసిన బ్రెడ్ తెచ్చిపెట్టింది. మాటాడకుండా ఆతృతగా గోవింద్ తిన్నాడు. హల్వాముద్ద పెట్టింది. అదీ ఖాళీ– అరటిపళ్ళు అరడజను పెట్టింది. అవీ పూర్తయ్యాయి. గ్లాసుడు నీరు త్రాగాడు. మరుక్షణంలో వాడి కళ్ళవెంబడి నీరు కారటం మొదలుపెట్టింది. కమీజుతో తడుచుకుంటూ, "రెండు రోజులై ఆరాటనపడి కడుపు కాలుతున్నా...." మరి మాట రాలేదు. దంపతులిద్దరూ మౌనంగా వున్నారు. ఉప్పొంగిపోతున్న దుఃఖాన్ని దిగమ్రింగటానికి ప్రయత్నిస్తూ "తమరు చూపించిన దయలో నూరోవంతు–సివరికి మా అయ్య సూపించినా యిలాగ దొంగని అయ్యేవాడ్నికాదు బాబూ!"

మళ్ళీ దుఃఖం పెల్లుబికిపోయింది.

"ఇంత సెడ్డోడికి యింత గౌరవం యెందుకిస్తారు బాబూ?"

డాక్టరు మెల్లగా "మనిషి దేవుని ముద్దుకొడుకు– అందుకే ఆలోచించడానికి మెదడు యిచ్చాడు. మనుష్యుల్లో మెదడులేనివాళ్ళే తోడిమనిషిని చెడ్డవానిని చేస్తారు... ఏడవకు!"

"బాగా చెప్పావ్ మా రాజా! నేను చేస్తున్నవన్నీ పాపం పనులని నాకు తెలుసు. కానీ నాకే కట్టుకోడానికి గుడ్డవుంటే యీ పాపపు పనులన్నీ సేస్తానా బాబూ?"

అతని జీవితం తెలుసుకోవాలన్న ఆతృతతో డాక్టరు "పాపం! చాలా కష్టాలు పడి వుంటావు," అన్నాడు.

"కష్టాలంటావా బాబూ? అవన్నీ తలసుకుంటే మరి బతకలేను. మా యమ్మ సచ్చిపోనాది, నా కొచ్చింది బాధ! మా యమ్మ వుంటే నాలుగింటి నౌఖరీ వేసి

మా అయ్య తాగడానికి యిచ్చేది. అది లేకపోబట్టి మా అయ్య కర్రతో బాది మరీ జేబుదొంగతనాలకి పంపించేవోడు. దొరికిందంతా లాగుకొనేవాడు. వాడు తాగేవోడు. నాకు తాగించేవాడు. తాగి తాగి ఒక రోజున నడుస్తూనే రోడ్డుమీద సచ్చిపోనాడు. ఏకాకిని. ఆడున్నప్పుడు నాలుగు కొట్టినా నావాడని ఒకడుండేవాడు. అన్నిటికీ నేనే అన్ని యిదాల వయసు వచ్చేసరికి పాడుపడి పోయాను–పట్టుబడి పోయాను. జైలుకు వెళ్ళాను. వచ్చినాను. ఎక్కడైనా నౌకరీ దొరుకుతుందేమో అని చూసాను. శిక్షపడినోడికి నౌకరీ యెవురిస్తారు?

"మళ్ళీ దొంగతనాలు. ఇంచుమించు నా వయసు దాయే– నాకు దాపురించింది. ఎంత తెచ్చినా దాని దాహం తీరింది కాదు. దాన్నించే మళ్ళా జెయిలుకెళ్ళాను. నాను తిరిగి వచ్చేసరికి అది యింకోడితో లేచిపోయింది. మనసు చెడిపోయింది. లోకం అంతా డబ్బుతోనే వుంది మారాజా. యవడిబాగు ఆడిది. ఎవడితోవ ఆడిది. మట్టిని పుట్టిన సెట్టు మనిషికి కాయలూ పళ్లూ యిస్తాది. మనిషికి పుట్టిన మనిషి తోడిమనిషిని సూడనేడు. బాధలన్నీ సూసి దేముడిమీదే సిరాకెత్తింది. మాకు కూడూగుడ్డా లేనిది నీకు బంగారం కిరీటం యెందుకు అని దొంగతనం చేసి అమ్మేసినాను. వచ్చిన డబ్బుతో బట్టలుకొని సుట్టుపట్లవున్న లేనోలకి పంచి పెట్టేసినాను.

"అనాడే నాకొకడు కలిశాడు. తాగి పెళ్ళానిని బాదుతున్నాడు. అడ్డుకుంటే నన్ను కొట్టాడు. అదేంటో అనాడు మా యమ్మే గేపకానికి వచ్చింది. మా యమ్మలాంటి అడదాన్ని అప్పటికి నా సుట్టుపట్ల సూడలేదు. ఆ అడదాన్ని సూడగానే అదేంటో నా కంత అభిమానం పుట్టుకొచ్చింది. వాడివళ్లు పచ్చడిచేసేను. సచ్చిపోతాడేమో అనుకున్నాను. బతికేడు. నానంటే పక్కబెదురుగా వుండేది. నాతో దొంగతనాల్లో ఒంతు కలిశాడు. మా యిద్దరివైరం పోయింది. నాతో అంతా సెప్పుకున్నాడు. అది వాడి పెళ్ళాంకాదు. మంచికబుర్లాడి నమ్మించి తీసుకొచ్చాడట. ఆడి అసలు పెళ్ళం పిల్లలూ వూర్లో వున్నారు. వాడు దొరికిందంతా తాగుడుకే పోసాడు. నేను వాడి పెళ్ళాం తిండికి సరిపడింది యింట్లో వేసేవాడిని, వాళ్ళ యింట్లోనే తినేవాడిని.

"ఒక రోజు పోలీసులను తప్పించుకోటానికి రైలుబండిమీద చెయ్యిజారి నేలపడి సచ్చినాడు.

"దీని కింకెవరూ గతిలేరు. నాను కట్టుకున్నాను. సుఖం అంటే దీనివల్లే యెరుగుదును బాబూ! నా మాటకు ఒకనాడు యెదురు తిరగలేదు. నాకు సారా కావాలంటే తెస్తూ పట్టుబడిపోయి జైలు కెళ్ళిపోయింది. ఇంటికొస్తే కమ్మని కబురు, కడుపునిండా తిండి, కంటినిండా కునుకు యిచ్చింది. ఇప్పుడు నా వంశాన్ని నిలబెట్టింది."

వర్షం తగ్గిపోయింది. డాక్టరు ఒక నిట్టూర్చి "ఇంత గడిస్తూ ఆ పాకలో వున్నావేం?" అనడిగాడు.

గోవింద్ నవ్వాడు. "న్యాయంఅనేది లోకాన సావదు బాబూ. అది ఛస్తే పొద్దు పొడుస్తుందా? గాలి వీస్తాదా? పాపం డబ్బున్న కొంప గడుస్తాదా? నీతిలేని కొంప నిలుస్తాదా?

"ఇన్ని తెలిసి...." ఆమె అందుకుంది.

"గోతిలో యెందుకు పడ్డావంటా వమ్మా?.... ఏం సెయ్యమంటావు? కడుపు మాసంద్రం- తెల్లారితే పరగడు పే......"

గోవింద్ ఒక్కసారి యేడుస్తున్న కొడుకు వున్నగదివేపు చూశాడు. డాక్టరు వెళ్ళగానే యేడుపు ఆగింది. తిరిగివచ్చి దగ్గర కూర్చోగానే గోవింద్ ముఖం వెలిగింది.

"సూడమ్మా..... ఇన్ని పాపాలు చేసినా దేముడికి నేనంటే యెంత కనికారమో? మీ యింట్లోనికి తెచ్చి- ఒక పండులాంటి కొడుకునిచ్చాడు. ఇంకా దేముడికి యెదురు తగిల్తే కోపంరాదూ? మా నాన్న దొంగతనం చేసాడు- తాగాడు. నాకూ అవే అబ్బాయి. నా కొడుకెదురగా నేను చేస్తే నా కొడుక్కీ అవే అబ్బుతాయి. అంచేత యీ వేళనించి దేముడి తోడు... యీ చెడ్డపనులన్నీ మానేస్తాను. కష్టపడి కూలి సేసుకుంటాను. రెండు రోజులకి ఒకసారి గెంజి తాగినా తృప్తితో బలంగా వుంటాను."

ఇంతలో బయట తలుపు యెవరో తట్టారు. డాక్టరువెళ్ళి తలుపు తీయగానే బైటనిలబడే సి.ఐ.డి మెల్లగా "మిమ్మల్ని అభినందించాలి," అన్నాడు.

డాక్టరు బయటకు వెళ్తూ "ఎందుకూ?" అన్నాడు.

"వాడ్ని పట్టుకోడానికి మీరు సహాయం చేసారు."

డాక్టరు రెండు చేతులూ చూపించి "నా చేతులకు కూడా బేడీలు వెయ్యండి." అన్నాడు. "మీరెలాగైనా ఆమెను తీసుకవచ్చి మీ యింట్లో పెట్టాలని అలా జడిపించాను. మీ పట్టుదల మేం అనుకున్నట్లే పోచ్చయిందిగా."

"వాడు అక్కడికే వచ్చేవాడు. నా యింట్లో వాడ్ని యెందుకు అరెస్టు చేస్తారు? వాడు నా అతిథి."

"మాకు తెలుసు వాడు అక్కడికి రాడని. ఇక్కడికి మీరు తీసుక రావటం వాడే మూలనించైనా చూస్తాడు. ఇక్కడకు మేం రాలేమనే దీమాతో వస్తాడు. ఏం? అనుకున్నట్లే జరిగిందిగా."

"అయితే యిప్పుడేం చేయదలచారు?"

"వాడు తప్పించుకొని పారిపోకుండా మీ యింటి చుట్టూ పోలీసులు చుట్టుముట్టారు. వాడ్ని అరెస్టు చేస్తాం - మేజస్ట్రేటు ముందు నిలబెట్టాం-"

"వాడు యిప్పుడు మొదటి రకం మనిషి కాదు. పూర్తిగా మారిపోయాడు. కొడుకును చూడగానే చెమటోడ్చి గంజిత్రాగి బ్రతుకుతానంటున్నాడు- వాడ్ని దయచేసి విడిచిపెట్టండి- న్యాయంగా బ్రతకడానికి అవకాశం యివ్వండి."

"చట్టం సమ్మతించదు."

"కానీ దేముడు సమ్మతిస్తాడు."

"చట్టం మనిషి చేసింది......"

"కానీ దేముడు మనిషిని చేశాడు."

"మీరు యీ శతాబ్దం మనిషిలా లేరు. ఎదురుగా కనపడే నగ్న సత్యం చట్టం. ఒక విధమైన నమ్మకం దేముడు. మాకు నమ్మకాలతో పనిలేదు. నిజంతో పని...." అంటూ ముందుకు పోతుంటే డాక్టరు చెయ్యి అడ్డుపెట్టాడు సి.ఐ.డి. బేడీలు తీసి లోనికి వెళ్ల మన్నాడు. డాక్టరు లోనికి వెళ్ళాడు.

అప్పటికీ గోవింద్ వందనతో యింకా కబుర్లు చెప్తున్నాడు. వీళ్ళను చూసి చప్పున లేచిపోయి పారిపోవటానికి బయటకు వెళ్తూ వీధి గుమ్మం దగ్గర గోడకు అనుకొని నిల్చున్న డాక్టరు వేపు చూసాడు. డాక్టరు తలదించి వున్నాడు.

"బాబూ.......నా కోసం విచారించకండి. మీరుండగా నాకేం బెంగలేదు."

వాళ్ళంతా వెళ్ళిపోయినా డాక్టరు అలా శూన్యంగా చూస్తూ నిల్చుండిపోయాడు.

ఆ మూడో రోజున రాత్రి భోజనాల దగ్గర వందన అన్నది– "వాడు తిరిగి జైలునించి వచ్చేవరకూ ఆమెను యిక్కడే వుంచేద్దాం."

(ఆంధ్రప్రదేశ్ – ఏప్రిల్, 1963)

* * *